

"బలమే జీవితం,
బలహీనతే మరణం."


RNI NO: APTEL/25/A4894

# ఉషశ్రీ

USHASRI తెలుగు దినపత్రిక



RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక

సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377



సంపుటి : 01 | సంచిక : 62 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | మంగళవారం 12 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor


## మళ్లీ యుద్ధమేఘాలు?

- ఇరాన్ షరతులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్న ట్రంప్
- అమెరికా ప్రతిపాదనలను తోసిపుచ్చిన ఇరాన్
- తాము తలొగ్గేది లేదన్న ప్రభుత్వం
- అణు కేంద్రాలను కూల్చే వరకు యుద్ధం ఆగదన్న నెతన్యాహు
- హర్మూజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు



అంతర్జాతీయం, ఉష శ్రీ

మధ్యప్రాచ్యంలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరాన్ చేసిన శాంతి ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. ఇరాన్ షరతులు 'పూర్తిగా ఆమోదయోగ్యం కాదు' అని ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామంతో వారాలుగా జరుగుతున్న చర్చలు విఫలమై మళ్లీ యుద్ధం ప్రారంభమయ్యే అవకాశాలు పెరిగాయి. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో




# ఢిల్లీలో గట్టిగా గళం

- అమిత్ షాతో చంద్రబాబు కీలక భేటీ
- పెండింగ్ నిధుల విడుదల కోరిన సీఎం
- విభజన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి
- పోలవరం పూర్తి లక్ష్యం 2027 పుష్కరాలు
- స్టాప్ వర్క్ ఆర్డర్ తొలగించాలన్న చంద్రబాబు
- 297 నీటి వనరులకు రూ.285 కోట్లు అభ్యర్థన
- ఆలమట్టి ఎత్తు పెంపుపై ఏపీ అభ్యంతరం



**విభజన హామీలు, పెండింగ్ నిధులు ఢిల్లీలో గట్టిగా గళం వినిపించిన సీఎం**

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, పెండింగ్ నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని, విభజన హామీలను నెరవేర్చాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయిన చంద్రబాబు...
రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత


మిగతాది 2 లో...


## ఫిన్‌లాండ్ పంపించాం

- అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని హామీ
- విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్న రేవంత్ రెడ్డి
- అందుకే విద్యాశాఖను తాను నిర్వహిస్తున్నట్లు వెల్లడి



తెలంగాణ, ఉష శ్రీ

విదేశాల్లో అమల్లో ఉన్న విద్యావిధానాలను అధ్యయనం చేయడానికి 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను తెలంగాణలో అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విద్యావారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యావ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని, అందుకే విద్యాశాఖను తానే నిర్వహిస్తున్నానని అన్నారు. విద్యా వ్యవస్థలో తెలంగాణ దశాబ్దాలుగా వివక్షకు గురైందని అన్నారు. అందుకే 1969లో తెలంగాణ ఉద్యమం వచ్చిందని, నాటి నుంచి నాలుగున్నర దశాబ్దాలు పోరాడి తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. తమ ప్రభుత్వం రాగానే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియమక పత్రాలు

## మోదీ వ్యాఖ్యలపై రాహుల్ ఘాటు స్పందన

- ప్రజలు త్యాగాలు చేయాలన్న ప్రధాని మోదీ విజ్ఞప్తి
- ఇది వైఫల్యానికి నిదర్శన మంటూ రాహుల్ గాంధీ విమర్శ
- ఏడాది పాటు బంగారం కొనొద్దని, ఇంటి నుంచే పనిచేయాలని సూచించిన మోదీ
- ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టేస్తున్నారన్న రాహుల్

జాతీయం, ఉష శ్రీ

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు



## కోట్లు వదిలి లక్షల్లోకి..

- అలవెన్సులతో కలిపి విజయ్ నెల జీతం రూ. 2.85 లక్షలు
- చెన్నైలో అధికారిక బంగ్లా, బుల్లెట్‌ప్రూఫ్ వాహనం వంటి సౌకర్యాలు
- ముఖ్యమంత్రిగా విజయ్‌కు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత
- పదవీ విరమణ తర్వాత కూడా పెన్షన్, ఇతర ప్రయోజనాలు



జాతీయం, ఉష శ్రీ

తమిళ సినీ రంగంలో అగ్రశ్రేణి నటుడిగా, 'సూపర్‌స్టార్'గా కోట్లాది రూపాయల పారితోషికం అందుకున్న దళపతి విజయ్, ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నిన్న ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. నటుడిగా అత్యధిక పారితోషికం తీసుకున్న ఆయన, ఇప్పుడు ప్రజా సేవకుడిగా నెలకు ఎంత జీతం తీసుకోబోతున్నారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

- 1998 పోఖ్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు
- సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని
- బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ....
- సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

జాతీయం, ఉష శ్రీ

భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని





## తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ రాజుకున్న పోలవరం వివాదం

- పోలవరం ఫేజ్-2 పనులు ఆపాలన్న తెలంగాణ
- ముంపు ప్రాంతాలపై పూర్తి సర్వే చేయాలన్న డిమాండ్
- కేంద్ర అనుమతి లేకుండా పనులంటూ ఏపీపై ఆరోపణలు
- పోలవరం పూర్తి కోసం కేంద్ర సహకారం కోరిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ





పోలవరం ప్రాజెక్టు, దాని ముంపు ప్రాంతాల విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ పోలవరం అగ్గి రాజేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పనులను తక్షణమే ఆపాలంటూ.. తెలంగాణ ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పోలవరం ప్రాజెక్ట్ అథారిటీకి రేవంత్ సర్కార్ లేఖ రాసింది. పోలవరం పూర్తి స్థాయి సర్వే అయిపోయే వరకు నిర్మాణ పనులు ఆపాలని స్పష్టం చేసింది. పోలవరం ఫేజ్ 2 పనులపై తెలంగాణ సర్కార్ అభ్యంతరం చెప్పింది. ఈ పనులను వెంటనే నిలిపివేయాలని పోలవం ప్రాజెక్ట్ అథారిటీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. ప్రాజెక్టు ముంపు ప్రాంతాలకు సంబంధించి పూర్తి స్థాయి సర్వే పూర్తి అయ్యే వరకు పోలవరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే భద్రాచలం సహా పలు ముంపు ప్రభావిత ప్రాంతాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే 36 వాగుల డ్రైనేజ్ ప్రభావంపైనా అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ క్రమంలోనే పోలవరం

# మోదీ వ్యాఖ్యలపై రాహుల్ ఘాటు స్పందన



చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.

**ప్రధాని విజ్ఞప్తి ఇదే.. :** హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# కోట్లు వదిలి లక్షల్లోకి..




**జీతభత్యాల వివరాలు:** తమిళనాడు ముఖ్యమంత్రికి నెలకు రూ. 2,05,000 ప్రాథమిక వేతనంగా అందుతుంది. ఇది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కాస్త తక్కువే. అయితే, ఎమ్మెల్యేగా లభించే నియోజకవర్గ భత్యం (సీవీఏ), దినసరి భత్యం వంటి వివిధ అలవెన్సులను కలుపుకుంటే సీఎం విజయ్ నెలకు మొత్తం రూ. 2,85,000 జీతంగా అందుకుంటారు. ప్రజా ప్రతినిధిగా అధికారిక పనులు, సమావేశాలకు అయ్యే ఖర్చుల కోసం ఈ భత్యాలను చెల్లిస్తారు.

**ప్రభుత్వ సౌకర్యాలు.. ఇతర ప్రయోజనాలు:** జీతంతో పాటు ముఖ్యమంత్రి హోదాలో విజయ్‌కు పలు ప్రభుత్వ సౌకర్యాలు లభిస్తాయి. చెన్నైలోని ఓ విలాసవంతమైన ప్రాంతంలో పూర్తి సదుపాయాలతో కూడిన అధికారిక నివాస బంగ్లాను కేటాయిస్తారు. క్యాంపు కార్యాలయం, సిబ్బంది కోసం కూడా ఇందులో ఏర్పాట్లు ఉంటాయి. ప్రయాణాల కోసం బుల్లెట్‌ప్రూఫ్ ఎస్‌యూవీతో పాటు పూర్తి కాన్వాయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. రాష్ట్రంలో లేదా దేశంలో అధికారిక పర్యటనల సమయంలో విమాన, రైలు, రోడ్డు ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. అంతేగాక బసను కూడా 'స్టేట్ గెస్ట్'గా ఏర్పాటు చేస్తారు.

**భద్రత.. పదవీ విరమణ ప్రయోజనాలు:** ముఖ్యమంత్రిగా విజయ్‌కు అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తారు. ఆయనకు జెడ్ ప్లస్ (z) కేటగిరీ భద్రత ఉంటుంది. ఇందులో భాగంగా 30 మందికి పైగా ఎలైట్ కమాండోలు, పోలీసు సిబ్బంది నిరంతరం ఆయన భద్రతను పర్యవేక్షిస్తారు. ఇక, పదవీ విరమణ తర్వాత కూడా మాజీ ముఖ్యమంత్రి హోదాలో పెన్షన్, వైద్య సదుపాయాలు, ఉచిత రైలు ప్రయాణం, పరిమిత సిబ్బందితో కూడిన కార్యాలయ నిర్వహణ ఖర్చులు వంటి ప్రయోజనాలు జీవితాంతం కొనసాగుతాయి.

# తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ రాజుకున్న పోలవరం వివాదం



లిఫ్ట్ స్కీమ్‌ను మళ్లీ ప్రారంభించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా.. ఆంధ్రప్రదేశ్ నిర్మాణ పనులు చేపడుతోందని తీవ్ర ఆరోపణలు చేసింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ పనులను వెంటనే ఆపాలని తెలంగాణ తేల్చి చెప్పింది. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను చేయకుండా నియంత్రించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి విజ్ఞప్తి చేసింది. మరోవైపు.. ఇవాళ ఢిల్లీకి వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు.. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రమంత్రితో చంద్రబాబు మంతనాలు సాగించారు. ఏపీ ప్రయోజనాలను రక్షించడమే లక్ష్యంగా కీలక ప్రతిపాదనలతో కూడిన లేఖను కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి సమర్పించారు. అదే సమయంలో వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం విజయవంతంగా పూర్తి అయిందని వెల్లడించారు. ఇక గ్యాప్ 1, 2 పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర సాగునీటి అవసరాల కోసం కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినందున.. అందుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని విన్నవించారు. 2011 నుంచి ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు



సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు. సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# మళ్లీ యుద్ధమేఘాలు?



ట్రంప్ స్పందిస్తూ "ఇరాన్ ప్రతినిధుల స్పందనను చదివాను. అది నాకు నచ్చలేదు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు!" అని పోస్ట్ చేశారు. యుద్ధం ప్రారంభం కావడానికి ప్రధాన కారణమైన ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇప్పటికే నియంత్రించామని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సైనికంగా ఓడిపోయిందని చెబుతూనే, ఆ దేశం పెట్టిన షరతుల వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు, ఇరాన్ తన శుద్ధి చేసిన యురేనియంలో కొంత భాగాన్ని గాఢత తక్కువ చేసి, మిగిలినదాన్ని మూడో దేశానికి తరలించడానికి అంగీకరించినట్టు 'వాల్ స్ట్రీట్ జర్నల్' తెలిపింది. చర్చలు విఫలమైతే ఆ యురేనియం తిరిగి తమకు అప్పగించాలనే హామీని ఇరాన్ కోరినట్టు మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా తెలిసిందని ఆ కథనం పేర్కొంది.

**ఇరువైపులా మొండిపట్టు:** అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ కూడా తిరస్కరించింది. తమకు అమెరికా యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, హార్మూజ్ జలసంధిపై పూర్తి సార్వభౌమాధికారం ఇవ్వాలని, ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. "శత్రువుకు ఎప్పటికీ తలొగ్గం. చర్చలు అంటే లొంగిపోవడం కాదు" అని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఎక్స్‌లో స్పష్టం చేశారు. మరోవైపు, ఇరాన్‌లోని యురేనియం నిల్వలను పూర్తిగా తొలగించి, అణు కేంద్రాలను కూల్చివేసే వరకు యుద్ధం ముగియదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించగా.. ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించింది. ఈ నేపథ్యంలో, హార్మూజ్ జలసంధిలో వాణిజ్య ప్రవాహాలను పునరుద్ధరించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ 40 దేశాలతో రక్షణ మంత్రుల సమావేశం ఏర్పాటు చేయనున్నాయి. ఈ పరిణామాల మధ్య ఇరు దేశాలు తమ మొండి వైఖరిని వీడకపోవడంతో మధ్యప్రాచ్యంలో శాంతి ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది.

# ఢిల్లీలో గట్టిగా గళం




పథకాల కింద రావలసిన నిధులతో పాటు, విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు జరిపి, అవసరమైన సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తాను ఇప్పటికే ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించానని, కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం ఏప్రిల్ నాటికి పూర్తయిందని వివరించారు. ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా ఉన్న 'స్టాప్ వర్క్ ఆర్డర్'ను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, సామర్థ్యం పెంచిన కుడి, ఎడమ కాలువలకు అయిన అదనపు ఖర్చును రీఎంబర్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమావేశంలో 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన'లోని 'హర్ ఖేత్ కో పానీ' పథకం కింద రాష్ట్రంలోని 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఆలమట్టి డ్యామ్ ఎత్తును 524.256 మీటర్లకు పెంచే అం ఈ నిర్ణయం ఏపీ ప్రయోజనాలకు నష్టం చేకూరుస్తుందని, కర్ణాటక చేపడుతున్న పనులను నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర దాహార్తిని తీర్చే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని, నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫిన్‌లాండ్ పంపించాం



అందించినట్లు చెప్పారు. వివాదాలు లేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు పెంచుతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకహారం పెట్టనున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కానీ మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని అన్నారు. టెన్ ప్లస్ టు విధానం లేకపోవడం వల్ల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని వెల్లడించారు. కుల వివక్షను నిర్మూలించేందుకు తాము ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళ నిర్మాణం చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.

## ప్రకృతి వైద్యులు డా.వేగిరాజు గోపాలరాజు సేవలు చిరస్మరణీయం



**భీమవరం: (ఉషశ్రీ)మే 11:** ప్రకృతి వైద్య సేవలకు జీవితాంతం అంకితభావంతో సేవలందించిన ప్రముఖ ప్రకృతి వైద్యులు డా.వేగిరాజు గోపాలరాజు స్మారకార్థం సోమవారం భీమవరం ప్రకృతి ఆశ్రమంలో సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరై డా.గోపాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా.వేగిరాజు గోపాలరాజు సేవలు సమాజానికి ఎనలేనివని పేర్కొన్నారు. తమ తాతగారు, తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన ఆశయాలను కొనసాగిస్తూ, గ్రామాన్ని వదలకుండా ప్రకృతి ఆశ్రమంలోనే నిరంతరం వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ప్రకృతి వైద్యంపై నమ్మకం ఉంచి, పేద ప్రజలకు అందుబాటులో వైద్యం అందించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అనేక మందికి ఆయన ప్రకృతి వైద్యంతో ఉపశమనం కలిగించారని, వేలాది కుటుంబాల్లో ఆరోగ్యంపై నూతన ఆశలు నింపారని తెలిపారు. సేవాభావం, నిబద్ధత, మానవత్వం కలగలిపిన వ్యక్తిత్వం డా. గోపాలరాజుదని, ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, డా. వేగిరాజు రామకృష్ణంరాజు, వేగిరాజు శివవర్మ, డా.మూర్తి, గోకరాజు పాండురంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్. విద్యార్థులు ఫ్లాగ్ డే ఫండ్ కు రూ.1,64,449 విరాళం



**గుంటూరు, ఉషశ్రీ :** ఆర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ కు వడ్లమూడి విజ్ఞాన ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్ సంస్థ రూ.1,64,449 లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మకు అందించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంస్థ ఎస్టేట్ మేనేజర్ మరియు మాజీ కెప్టెన్ రామ్ మోహన్ రావు చెక్కును అందజేశారు. ఆర్మ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ కు చెక్కును అందించినందుకు జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి



**గుంటూరు, ఉషశ్రీ:** జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 524 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 233, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 182 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 8 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 21 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 49, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 31 అర్జీలు అందాయి సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. అర్జీలు పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 13న స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయనున్న సి.యం



**గుంటూరు, ఉషశ్రీ:** బి.ఐ.ఎస్.ఇ.ఆర్ మెడికల్ కాలేజీ, కార్పొరేట్ ఆసుపత్రి మరియు స్కిల్ యూనివర్సిటీకి ఈ నెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. మంగళగిరి మండలం నిడమర్రులో ఈ కార్యక్రమం జరగనున్న దృష్ట్యా జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ, సంబంధిత అధికారులు ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వచ్చే మార్గం, ప్రజలు వచ్చే మార్గం వాటి పరిస్థితులు పరిశీలించారు. రెండు వేల మంది వరకు హాజరు అయ్యే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కే శ్రీనివాసరావు, లక్ష్మీ కుమారి, ఉప రవాణా కమిషనర్ కే సీతారామిరెడ్డి, అదనపు ఎస్పీ ఏ.టి.వి రవి కుమార్, సి.పి.డి.సి.ఎల్ ఎస్.ఇ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యలో రాణించాలి.



జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

**భీమవరం:(ఉషశ్రీ) మే 11:** భీమవరం వన్‌టౌన్‌లోని ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో భీమవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుచూ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మానవతా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు, నగదు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా విద్యపై పూర్తి దృష్టి సారిస్తేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. విద్య ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులను అధిగమించి సమాజంలో మంచి స్థానం సంపాదిం చవచ్చని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా అబ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిభా అవార్డులు, నగదు పురస్కారాలు అందిస్తున్న మానవతా సంస్థ సేవలను ఆయన అభినందించారు. సంస్థ గౌరవ డైరెక్టర్ పెనుమత్స రామ్మోహన వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ, భీమవరం పట్టణం మరియు మండల పరిధిలోని 23 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం రూ.44,000 నగదు పురస్కారాలు, జ్ఞాపికలు, మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో పోటీ భావన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ మాట్లాడుతూ, మానవతా సంస్థ విద్యా రంగంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను సంవత్సరం పొడవునా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. విద్యార్థులు ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు మరియు మెరిట్ విద్యార్థులకు డాక్టర్ దీప్తి రాజు మరియు వారి మిత్రబృందం తరఫున ఒక్కొక్కటి రూ.600 విలువైన 27 చేతి గడియారాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బుద్దరాజు వెంకటపతి రాజు, ఇన్‌చార్జి అధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి వడ్డి వెంకటేశ్వరరావు, కో-చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి బాబు, కోశాధికారి గ్రంధి కుమార్ వెంకటేశ్వర వరప్రసాద్, కలిగొట్ల గోపాల శర్మ, సీతారామరాజు, అల్లు శ్రీనివాస్, ఎం.ఈ.ఓ. సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

## కాలు బెనకటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి...
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...

**భీమవరం: (ఉషశ్రీ) మే 11:** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాలు బెనకటంతో, ఆమె భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సాధారణ వ్యక్తి లాగానే ఓపీ నమోదు చేయించుకుని ఎక్స్‌రే తీయించుకుని, ఆర్థోపెడిక్ విభాగంలో వైద్య చికిత్స పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని పలు విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత ఎలా ఉంది, అవసరమైన మందులు అందుతున్నాయా, వైద్యులు మరియు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా, ఆసుపత్రి పరిసరాలు మరియు వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉన్నాయా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా వంటి పలు అంశాలపై రోగులను ప్రశ్నించారు. రోగులు స్పందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, గతంతో పోలిస్తే వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సౌకర్యాలు బాగున్నాయని రోగులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం దశలవారీగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యశాఖ పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రతి నెల వైద్యశాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖలతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా లోటుపాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆసుపత్రుల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు గమనించినట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

## 22 (ఎ) కేసులు పక్కాగా విచారణ చేయాలి



### రెవెన్యూ అధికారులు సక్రమంగా వ్యవహరించాలి

**గుంటూరు, ఉషశ్రీ:** జిల్లాలో 22 (ఎ) కేసులు పక్కాగా విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రెవెన్యూ, రీ సర్వే, జి రామ్ జి అంశాలపై జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహసిల్దార్ విధిగా వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు విధిగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. క్లాసిఫికేషన్ ఖచ్చితంగా ఉంటే జాబితా నుండి తొలగించాలని ఆదేశించారు. అభ్యంతరకర పోరంబోకుగా ఉన్న జల వనరుల ప్రదేశం, చెరువులను స్పష్టంగా విచారణ చేపట్టి, నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో 22 (ఎ) క్రింద ఉన్న వాటిని శుక్రవారం నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. రిసర్వేను నాణ్యంగా చేయాలని ఆదేశించారు. రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు.

**ఉపాధి హామీ పనుల వేతనదారుల సంఖ్య పెరగాలి :** జిల్లాలో వేతనదారుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. మేడికొండూరు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పరిస్థితీ బాగా మెరుగుపరచాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు.

**ఎస్.జి.ఎస్.డబ్ల్యూ సేవలు త్వరగా అందాలి:** ప్రజలు వివిధ అవసరాలకు దరఖాస్తు చేసుకున్న సేవలను త్వరగా అందించాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోనే సేవలు అందాలని అన్నారు. రెవిన్యూ క్లినిక్ లకు తహసిల్దార్ లు హాజరు కావాలని, అదే సమయంలో మండలాల్లో ఉప తహసిల్దార్ లు పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సైతం పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.కృష్ణ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, సర్వే ఉప సంచాలకులు తోయజాక్షజ రావు, తదితరులు పాల్గొన్నారు.

# జన గణన ప్రాధాన్యతతో చేపట్టాలి



**గుంటూరు, ఉషశ్రీ:** జిల్లాలో జన గణనను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం వివిధ అంశాలపై జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం ఇళ్ల వద్ద అందుబాటులో ఉంటారని గమనించాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్యుమరేటర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో గృహ సందర్శన చేయడం శ్రేయస్కరంగా సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగడం తగ్గించాలని అన్నారు.

**జలధార జల హారతి పనులు పూర్తి చేయాలి:** మంజూరైన జలధార – జల హారతి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంజూరు చేసిన పనులలో ఇంకా ప్రారంభం చేయడంలో జాప్యం జరుగుతుండటం పట్ల చేబ్రోలు, కాకుమాను, పొన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పనులను పూర్తి చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. పూర్తి సామర్ధ్యంలో చెరువులలో నీటి నిలువ చేయాలని ఆదేశించారు. చెరువు గర్భం మాత్రమే కాకుండా కాలువలు, స్లూయిస్ లలో గుర్రపు డెక్క ఉండరాదని, పూడికలు లేకుండా చూడాలని అన్నారు. యంత్ర పరికరాల వినియోగం అవసరం ఉన్న పనులను గుర్తించి, జాబితాను రూపొందించాలని ఆదేశించారు. డివిజనల్ అభివృద్ధి అధికారులు జలధార పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

**మండల ప్రత్యేక అధికారులు మూడు రోజులు క్షేత్ర స్థాయిలో ఉండాలి:** నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు వారంలో మూడు రోజులు – గురువారం, శుక్రవారం, శనివారం విధిగా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.కృష్ణ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్ధసారథి, కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, సర్వే ఉప సంచాలకులు తోయజాక్షజ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అధికారులు సేవలందించాలి




- ప్రజల సానుకూల స్పందనలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం: (ఉషశ్రీ)మే 11:** ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలపై సానుకూల స్పందన పెంపొందేలా అధికారులు శక్తివంచన లేకుండా పని చేసి, జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన మే 7, 8 తేదీల్లో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఒక ఒక నెలలో ఒక నియోజకవర్గంలో నాలుగు శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార నివేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. నెలలో నాలుగు వారాల పాటు ప్రణాళికాబద్ధంగా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలు చేపట్టి, మొదటి వారంలో స్వీకరించిన అర్జీలకు చివరి వారానికి పూర్తి స్థాయి పరిష్కారం చూపేలా పారదర్శకత, జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల కాలయాపన, వ్యయభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు ఇది మంచి వేదికగా ఉపయోగపడాలని తెలిపారు.

**వేసవిలో మంచినీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలి.. :** వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడా మంచినీటి కొరత తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, విఆర్వోలు తమ పరిధిలో నీటి సమస్యలు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

**గృహాలు, ఇళ్ల స్థలాలపై చర్యలు వేగవంతం చేయాలి :** పేదలకు మంజూరు చేసిన గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని, 22–ఏ భూ సమస్యలకు సంబంధించిన ఇళ్ల స్థలాల ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

**విద్య, మౌలిక వసతులపై సమీక్ష:** ఆచంటలో ఐటీఐ ఏర్పాటు కోసం అవసరమైన స్థల సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లను నివారించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మోడల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించి విద్యార్థుల చేరికలు పెంచాలని తెలిపారు. విద్యార్థుల లోటుతో ఏదైనా మోడల్ స్కూల్ మూసివేయాల్సిన పరిస్థితి వస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డిజిటల్ పరిపాలన, అభివృద్ధి పనులపై దృష్టి :** మీసేవ, ఇతర పోర్టల్స్ కు బదులుగా వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్‌లో వివిధ ధ్రువపత్రాలు, అనుమతులు కొరకు సేవలను పొందెల పౌరులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు అందరూ ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, విఆర్వోలు యాప్ ను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. 50% పైబడి పూర్తయిన ప్రభుత్వ భవన నిర్మాణాల జాబితా ను సిద్ధం చేసి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు విద్యా రుణాలను విరివిగా మంజూరు చేయాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు కూడా విద్యా రుణాలు మంజూరు అయ్యేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. ఫ్రీ స్కూల్స్‌లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా ఎంపీడీవోలు, సూపర్వైజర్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా పర్యవేక్షించి, ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమం అమల్లో రాష్ట్రవ్యాప్తంగా నూరు శాతం సాధించిన నాలుగు జిల్లాల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటని, ఇదే విధంగా రాబోయే సంవత్సరంలో కూడా నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన రఘురాం కృష్ణంరాజు



**ఆకివీడు:(ఉషశ్రీ) మే 11 :** ఆకివీడు మండలం లోని పలు గ్రామాల్లో సోమవారం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు పాల్గొన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు, మైక్రో వాటర్ ఫిల్టర్ లను ఆయన ప్రారంభించారు. అలాగే అప్పారావుపేట గ్రామంలో సిసి రోడ్డు, మైక్రో వాటర్ ఫిల్టర్, స్కూల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మోటుపల్లి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు కోపల్లె సాయిబాబు, ఆకివీడు పట్టణ టిడిపి అధ్యక్షుడు గంధం ఉమా, కడియం సుబ్రహ్మణ్యం, కోపల్లె హనుమ, సుంకర సుబ్రమణ్యం, మద్రివాడ వెంకటరావు, తోట వాసు, గవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



# కళాకారుల ఐక్యతతోనే కళారంగ అభివృద్ధి సాధ్యం



**విజయవాడ, ఉషశ్రీ మే 11:** ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులంతా ఐక్యంగా ఉంటేనే వారి కలలు సాకారం అవుతాయని, అదే కళామాతకు ఇష్టమని స్టార్స్ సిటీ 9 వ్యవస్థాపకులు గర్రె శివ రమేష్ అన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా "కళకు కలం తోడు" నినాదంతో ఏర్పాటైన స్టార్స్ సిటీ 9 సకల కళాకారుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ వన్‌టౌన్‌లోని సాయిరాం థియేటర్ సమీపంలో ఉన్న ప్రైవేట్ కార్యాలయంలో కళాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సినీ నిర్మాతలు, దర్శకులు, నటులు, కెమెరా టెక్నీషియన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లో సినీ కళారంగ అభివృద్ధి, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం సంస్థ లోగోను ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ బి. జయకుమార్ గుప్తా, నిర్మాత నాగోతి సింహాచలం, సినీనటుడు వెంపలి గౌరీశంకర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కళాకారుల భవిష్యత్తుకు మేలు చేసేలా ఉన్నాయని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులకు పూర్తి వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్షేత్ర టీవీ అధినేత గూడేల రాజన్న, సినీ నటులు వాండ్రాసి ఆనంద్ పాత్రుడు, నాగోతి శ్రీనివాసరావు, పి. రమేష్ వర్మ, దర్శకుడు టి. రామరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్, హాస్యనటుడు పి. శివకుమార్, జగుపిళ్ళ దుర్గా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు:** గిద్దలూరు నియోజకవర్గం హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానం నుండి రేడియో భావి సెంటర్ నందు ఆంజనేయ స్వామి దేవాలయం వరకు వేలాది మంది మహిళలతో కలశం ఒ శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్ర లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సంస్కృతిక నృత్యాలు , కోలన్న వంటి కార్యక్రమంలో పాల్గొన్నారు భక్తులు , మహిళలు కలిశశీ శోభాయాత్ర లో ఎమ్మెల్యే పాల్గొని జెండా ఊపి శోభా యాత్రను ప్రారంభించినారు కార్యక్రమంలో గిద్దలూరు మండల , పట్టణంలోని ప్రముఖులు , నాయకులు, భక్తులు తదితరులు శోభాయాత్ర లో పాల్గొన్నారు.

# దాతల సహాయం మరువలేనిది



**గిద్దలూరు,ఉషశ్రీ.** మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలో శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమమునందు ప్రతి సోమవారం భోజనం ఏర్పాటు చేయడం అందరికి తెలిసిన విషయమే ఈ సోమవారం మల్లు వెంకట్రామిరెడ్డి ధర్మపతి పద్మావతి మనవడు రిషికేశవరెడ్డి లు మళ్ళు పక్కిరారెడ్డి జ్ఞాపకార్థం 6500 భోజనము ఏర్పాటుకు అందించారు ఆశ్రమం దగ్గర భోజనం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని దాత వెంకటరామిరెడ్డి ధర్మపత్ని పద్మావతులు తెలిపారు దాతలకు శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన అన్న వితరణ సేవాశ్రమం తరపున ఘనంగా పూలమాలతో శాలువాతో కాశినాయన ఫోటో అందించి సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు పాలుగుళ్ల కాశిరెడ్డి విశ్రాంత సూపర్నెంటు వడ్డీ వీరారెడ్డి విశ్రాంత లెక్చరర్ లింగారెడ్డి విస్రాంత ఆర్మీ కాశినాయన ప్రియ శిష్యురాలు ముక్కంటి నరసమ్మ టీ కొట్టు నారాయణమ్మ కావ్య కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

# ఏపీకాస్ట్ ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవం ఘనంగా నిర్వహణ



**విజయవాడ, (ఉషశ్రీ) మే 11 :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవం 2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీకాస్ట్ సభ్య కార్యదర్శి డా. కె. శరత్ కుమార్, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థుల కోసం వివిధ పోటీలు, పోస్టర్ ప్రదర్శనలు, శాస్త్ర సాంకేతిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాంతీయ సైన్స్ సెంటర్ ప్రదర్శనలను సందర్శించిన డా. జి. లక్ష్మీశ విద్యార్థుల వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథాన్ని అభినందించారు. సాంకేతికత దేశ అభివృద్ధికి కీలకమని, యువత శాస్త్ర సాంకేతిక రంగాల్లో చురుకుగా పాల్గొని నవీన ఆవిష్కరణలకు ముందుకు రావాలని ఆయన సూచించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# జనగణన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహణ

### ఇళ్ల జాబితా, గృహ గణనను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, మే 11:** జనగణన-2027 ప్రక్రియను జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. జనగణన తొలి దశలో భాగంగా ఎనికేపాడులో కొనసాగుతున్న ఇళ్ల జాబితా, గృహ గణన (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్) ప్రక్రియను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లే సిబ్బందికి ప్రజలు సరైన, పూర్తి వివరాలు అందించాలన్నారు. జనగణన దేశ ప్రగతి, ప్రణాళికా రూపకల్పనకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం వంటి రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో ఎటువంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు కావడానికి ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందిని వినియోగిస్తున్నామని వెల్లడించారు.

# బడి పిలుస్తోంది చైతన్య రథం ప్రారంభం



**ఎన్టీఆర్ జిల్లా, మే 11:** జిల్లాలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్వహిస్తున్న "బడి పిలుస్తోంది" చైతన్య రథాన్ని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వరకు ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్. చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్. రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లిలో చలివేంద్రం ప్రారంభం



**కొండపల్లి,( ఉషశ్రీ )మే 11:** మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం ఆదేశాల మేరకు కొండపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగ అందించడం గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. ప్రజాహిత కార్యక్రమాల్లో కేడీసీసీ బ్యాంకు ముందుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కొప్పుల స్వరూప, స్థానిక నాయకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆనాధికార లౌడ్ స్పీకర్లపై డిజిపి కి లేఖ రాసిన రఘురామకృష్ణంరాజు



**ఆకివీడు: (ఉషశ్రీ) మే 11:** ప్రార్థన స్థలాల్లో అనధికార లౌడ్ స్పీకర్ల పై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురాం కృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. శబ్దకాలుష్యం నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థన స్థలాల్లో అధిక శబ్దాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్ స్పీకర్లతో విద్యార్థులు ,వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని రఘురామ అన్నారు. ఏడాదిలో గరిష్టంగా 15 రోజులు మాత్రమే లౌడ్ స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తు చేశారు. సుప్రీం కోర్ట్ మార్గదర్శకాలు అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిచరుని తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనాధికార సౌండ్ సిస్టములను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిబంధన లు అమలు చేయాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురాం కృష్ణంరాజు కోరారు.

# జిల్లా కలెక్టర్‌ను అభినందించిన పారిశ్రామిక వర్గాల ప్రతినిధులు

- హై వాల్యూ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్"తో జిల్లాకు పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశ
- వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమల ద్వారా అధిక ఆదాయం లక్ష్యం
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ....



**భీమవరం: (ఉషశ్రీ)మే 11:** పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తూ హై వాల్యూ ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక ఆదాయం సాధించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మే 7, 8 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా "హై వాల్యూ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్"ను జిల్లా కలెక్టర్ సమగ్రంగా ప్రదర్శించారు. వ్యవసాయ, ఆక్వా వ్యర్థాలను వినియోగించి సంపదను ఎలా సృష్టించవచ్చో, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ ఎంఎస్ఎంఈ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. జిల్లాకు పారిశ్రామికాభివృద్ధి దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సహజ వనరులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులను సమర్థవంతంగా వినియోగించి అధిక విలువ కలిగిన ఉత్పత్తుల తయారీకి మార్గం సుగమం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు తక్కువ విలువ కలిగిన ఉత్పత్తులకే పరిమితమైన పరిస్థితిని మార్చి, హై వాల్యూ ప్రొడక్ట్స్ తయారీ ద్వారా రైతులు, యువత, పారిశ్రామికవేత్తలకు అధిక ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో ప్రదర్శించిన ముఖ్య అంశాలు.. జిల్లాలో వరి మిల్లింగ్ వ్యర్థాల నుండి సంపద సృష్టి అవకాశాలను వివరిస్తూ ... వరి పొట్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి, సిలికా జెల్ తయారీ వరి తవుడు ద్వారా నూనె, పశుగ్రాస తయారీ, నూకలు, వరి గడ్డి ద్వారా ఇథనాల్ మరియు ఇతర ఉత్పత్తులు, ఆక్వా, సముద్ర ఉత్పత్తుల వ్యర్థరహిత శుద్ధి ప్రక్రియ, పశుసంపద వ్యర్థాల ద్వారా జీవశక్తి ఉత్పత్తి కోకో గింజల నుండి చాక్లెట్ తయారీ వరకు విలువ ఆధారిత శుద్ధి ప్రక్రియ "పశ్చిమగోదావరి సర్క్యులర్ ఎకానమీ మోడల్" ద్వారా నాలుగు ప్రధాన రంగాల్లో ఉప ఉత్పత్తులను సంపదగా మార్చే ప్రణాళిక తదితర అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ప్రణాళిక ద్వారా జిల్లాలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమలు పెరగడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హై వాల్యూ ఉత్పత్తుల తయారీ ద్వారా జిల్లాకు మంచి ఆదాయం సమకూరడమే కాకుండా, పశ్చిమగోదావరిని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లాలో 41 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- క్రీడాకారులకు అవసరమైన పరికరాల పంపిణీ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ పొందాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి....



**భీమవరం: (ఉషశ్రీ) మే 11:** పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ మండలాల్లో యువత, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మొత్తం 41 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కలిసి సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తున్న 16 మంది కోచ్‌లకు బాస్కెట్‌బాల్‌లు, ఫుట్‌బాల్‌లు, చెస్ బోర్డులు, బాక్సింగ్ కిట్లు తదితర క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సమ్మర్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులు, క్రీడాకారులకు వేసవి తీవ్రత దృష్ట్యా చిక్కీలు, నిమ్మరసం, అరటిపండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని జిల్లా క్రీడా అధికారి మోహన్ దాస్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శిక్షణా కార్యక్రమాలు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. మే నెలాఖరు వరకు ఈ సమ్మర్ కోచింగ్ సెంటర్లు కొనసాగనున్నాయని, జిల్లాలోని ప్రతి విద్యార్థి, యువకుడు ఈ శిక్షణా శిబిరాల్లో పాల్గొని ప్రయోజనం పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి మోహన్ దాస్, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# టెక్‌ట్రిక్స్ ఎక్స్‌పో యువ స్టార్టప్‌లకు సువర్ణావకాశం



**ఎన్టీఆర్ జిల్లా/ఎనికేపాడు, మే 11:** జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "టెక్‌ట్రిక్స్ 2026" స్టార్టప్ ఎక్స్‌పో యువ పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. స్థానిక ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించి గ్లోబల్ మార్కెట్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎనికేపాడులోని విజయవాడ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో జిల్లా యంత్రాంగం, ఆర్‌టీఐహెచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన టెక్‌ట్రిక్స్ 2026 స్టార్టప్ ఎక్స్‌పోను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపించే వేదికగా ఈ ఎక్స్‌పో నిలుస్తోందన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సేవలు, మహిళా సాధికారత తదితర రంగాలకు చెందిన స్టార్టప్‌లు తమ ఉత్పత్తులు, సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించాయి. సాంకేతికతను ప్రజల జీవితాలకు అనుసంధానం చేసే యువత ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతం పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఇప్పటికే 500 స్టార్టప్‌లకు చేయూత అందించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఉత్తమ స్టార్టప్‌లకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల నగదు బహుమతులు ప్రకటించినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా, ఈ-కామర్స్ వేదికలను సమర్థంగా వినియోగించి స్థానిక ఆలోచనలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని యువతకు సూచించారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని యువత సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. "ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త" లక్ష్య సాధనలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఎక్స్‌పోలో దాదాపు 120 స్టార్టప్‌లు పాల్గొని తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ఈజీ లెర్నింగ్ పరికరాలు, సేంద్రియ వ్యవసాయ సాంకేతికతలు, ప్రమాద నివారణ పరికరాలు, స్పేస్ టెక్నాలజీ, సముద్రశైవల ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్, హైడ్రాలిక్ టెక్నాలజీ వంటి అనేక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్ పాల్గొన్నారు.

# ఆగని అరాచకం

- మహిళల భద్రతపై పెరుగుతున్న ఆందోళన
- కుటుంబం నుంచి సమాజం వరకు బాధ్యత......
- సోషల్ మీడియా ప్రభావం
- చట్టాలు ఉన్నా భయం ఎందుకు తగ్గడం లేదు?
- యువతలో మారుతున్న మనస్తత్వం.....
- మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు......
- పిల్లలకు చిన్నప్పటి నుంచే అవగాహన అవసరం
- పోలీస్ వ్యవస్థలో మార్పుల అవసరం
- టెక్నాలజీ ద్వారా భద్రత
- సమాజం మారితేనే మహిళలకు నిజమైన రక్షణ



దేశం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. సాంకేతిక రంగంలో ప్రపంచానికి పోటీ ఇస్తోంది. అంతరిక్షం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ప్రతి రంగంలో భారతదేశం ముందుకు సాగుతోంది. కానీ మరోవైపు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు మాత్రం సమాజాన్ని కలవరపెడుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు, బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ సంఘటనలు కేవలం వార్తలుగా మారిపోతున్నాయి కానీ సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం మాత్రం కనిపించడం లేదు.

ఒక మహిళ రాత్రి బయటకు వెళ్లాలంటే భయం, ఒంటరిగా ప్రయాణించాలంటే అనుమానం, పరిచయం లేని వ్యక్తితో మాట్లాడాలంటే ఆందోళన అనే పరిస్థితి ఏర్పడింది. చిన్న పిల్లల నుంచి వృద్ధ మహిళల వరకు ఎవరూ పూర్తిగా సురక్షితంగా లేరనే భావన సమాజంలో పెరుగుతోంది. ఇది కేవలం మహిళల సమస్య కాదు. సమాజం మొత్తం ఎదుర్కొంటున్న ఒక తీవ్రమైన సంక్షోభం. గత కొన్ని సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల సంఖ్య పెరుగుతున్నట్లు అనేక నివేదికలు చెబుతున్నాయి. నగరాలు మాత్రమే కాదు, గ్రామాల్లో కూడా ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. బాధితులు చాలాసార్లు భయంతో బయటకు రావడం లేదు. కుటుంబ గౌరవం, సమాజం మాట్లాడే మాటలు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు కారణంగా చాలా కేసులు బయటకు రావడం లేదని నిపుణులు చెబుతున్నారు.

సమాజంలో మహిళల పట్ల గౌరవ భావన తగ్గిపోవడం కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా, సినిమాలు, కొన్ని వెబ్ కంటెంట్‌లలో మహిళలను కేవలం వినోద వస్తువులుగా చూపించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మహిళల్ని సమాన వ్యక్తులుగా కాకుండా, బలహీనులుగా చూసే భావజాలం ఇంకా చాలా ప్రాంతాల్లో కొనసాగుతోంది. మహిళలపై జరిగే నేరాలకు కేవలం నేరస్తులనే కాదు, కొన్ని సందర్భాల్లో సమాజపు మౌనం కూడా కారణమవుతోంది. ఒక అమ్మాయి వేధింపులకు గురైతే చాలాసార్లు ఆమెనే తప్పు చేసినట్టుగా ప్రశ్నించడం జరుగుతోంది. "ఎందుకు అక్కడికి వెళ్లింది?", "ఎందుకు అలా మాట్లాడింది?", "ఎందుకు ఆ దుస్తులు వేసుకుంది?" అనే ప్రశ్నలు అడగడం ద్వారా బాధితురాలినే మానసికంగా మరింత బాధించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ విధమైన ఆలోచనలు మారాల్సిన అవసరం ఉంది.

మహిళలపై నేరాలు తగ్గాలంటే చట్టాలు కఠినంగా అమలవ్వాలి. ఇప్పటికే దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయి. కానీ కేసుల విచారణ ఆలస్యం కావడం, నిందితులకు త్వరగా శిక్షలు పడకపోవడం వల్ల భయం తగ్గిపోతుందని నిపుణులు అంటున్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మరింత సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉంది. బాధితులకు తక్షణ న్యాయం అందితేనే సమాజంలో మార్పు వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాత్రి సమయంలో ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం మంచిది. మొబైల్‌లో ఎమర్జెన్సీ నంబర్లు సేవ్ చేసుకోవాలి. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించాలి. కొత్త వ్యక్తులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

సోషల్ మీడియా వాడకంలో కూడా జాగ్రత్త అవసరం. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, లొకేషన్ వంటి సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవడం ప్రమాదకరం కావచ్చు. చాలా కేసుల్లో సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తులే మోసాలకు, వేధింపులకు కారణమవుతున్న ఘటనలు బయటపడుతున్నాయి. అందుకే డిజిటల్ భద్రతపై కూడా అవగాహన పెరగాలి. చిన్న పిల్లలకు కూడా "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" గురించి అవగాహన కల్పించడం చాలా అవసరం. చాలా కుటుంబాల్లో ఇలాంటి విషయాలపై మాట్లాడటానికి ఇంకా సంకోచం కనిపిస్తోంది. కానీ పిల్లలకు భద్రత గురించి చిన్నప్పటి నుంచే చెప్పాలి. ఎవరైనా అసౌకర్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా టీచర్లకు చెప్పాలని వారికి నేర్పించాలి.

పాఠశాలలు, కాలేజీల్లో మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవ భావన పెంచేలా పాఠ్యాంశాలు ఉండాలి. కేవలం అమ్మాయిలకు జాగ్రత్తలు చెప్పడం కాదు, అబ్బాయిలకు కూడా బాధ్యత, నైతిక విలువలు నేర్పించడం అవసరం. సమాజంలో మార్పు రావాలంటే పురుషుల ఆలోచనల్లో కూడా మార్పు రావాలి.

పోలీస్ వ్యవస్థ మరింత ప్రజలకు దగ్గరవ్వాలి. మహిళలు భయపడకుండా ఫిర్యాదు చేసే వాతావరణం ఉండాలి. కొన్ని చోట్ల మహిళా హెల్ప్ డెస్క్‌లు, షీ టీమ్స్ వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. వీటిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాలో మహిళల భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలి. టెక్నాలజీ కూడా మహిళల రక్షణలో కీలక పాత్ర పోషించగలదు. మొబైల్ యాప్‌లు, జీపీఎస్ ట్రాకింగ్, ఎమర్జెన్సీ అలర్ట్ వ్యవస్థలు ప్రమాద సమయంలో సహాయపడతాయి. పబ్లిక్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పెరగడం వల్ల కూడా నేరాల నియంత్రణకు కొంతమేర సహాయం జరుగుతోంది. అయితే కేవలం టెక్నాలజీతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. మనుషుల ఆలోచనల్లో మార్పు రావడం చాలా ముఖ్యం.

మహిళలపై జరిగే నేరాలు కుటుంబాల్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. బాధితురాలు మాత్రమే కాదు, ఆమె కుటుంబం మొత్తం మానసికంగా కుంగిపోతుంది. కొన్ని సందర్భాల్లో బాధితులు జీవితంపై నమ్మకం కోల్పోతున్నారు. అందుకే బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సహాయం, చట్టపరమైన సహాయం అందుబాటులో ఉండాలి. సమాజం వారిని తప్పు చేసినట్టుగా కాకుండా, ధైర్యంగా నిలబడేలా ప్రోత్సహించాలి. సినిమాలు, మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మహిళలను అవమానించే విధంగా చూపించే కంటెంట్‌ను తగ్గించాలి. మహిళల గౌరవం, స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రోత్సహించే కథనాలు పెరగాలి. ఎందుకంటే మీడియా ప్రభావం యువతపై చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటి పరిస్థితుల్లో మహిళల భద్రత కుటుంబ సభ్యులకూ ఒక పెద్ద ఆందోళనగా మారింది. తల్లిదండ్రులు తమ కుమార్తెల భద్రత కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ కేవలం ఇంట్లో బంధించి ఉంచడం పరిష్కారం కాదు. మహిళలు స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగినవారే. ఆ స్వేచ్ఛకు భద్రత కల్పించడం సమాజం బాధ్యత.

మహిళలపై నేరాలు తగ్గాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించాలి. ఒక మహిళ ఇబ్బందుల్లో ఉంటే చూడనట్టుగా వెళ్లిపోవడం కాదు, సహాయం చేయాలి. సమాజం స్పందిస్తేనే నేరస్తుల్లో భయం పెరుగుతుంది. నేటి తరానికి మహిళల గౌరవం గురించి బలమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అమ్మాయిలు బలహీనులు కారు. వారికి సమాన హక్కులు, భద్రత, గౌరవం కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత. మహిళలు భయపడకుండా జీవించే సమాజం ఏర్పడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ప్రతి ఇంట్లో మహిళకు గౌరవం ఉంటేనే దేశానికి గౌరవం ఉంటుంది. ప్రతి తల్లి, అక్క, చెల్లి, కుమార్తె భయంలేకుండా జీవించే రోజే నిజమైన స్వాతంత్ర్యం అని చెప్పాలి. సమాజం మారితేనే మహిళలపై జరుగుతున్న అరాచకాలకు పూర్తి స్థాయి అడ్డుకట్ట పడుతుంది.

## నాన్ కేడర్ ఎస్పీగా కుంభా కోటేశ్వరరావుకు పదోన్నతి

**ఎన్‌టీఆర్ జిల్లా, (ఉషశ్రీ ) మే 11:** ఏఆర్ అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న కుంభా కోటేశ్వరరావు నాన్ కేడర్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పీ)గా పదోన్నతి పొందారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయనను పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పీ టీ ఓ ) ఎస్పీగా బదిలీ చేసింది. 1991లో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో చేరిన కోటేశ్వరరావు 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సేవలందించారు. సేవా కాలంలో 120 రివార్డులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవా మరియు ఉత్తమ సేవా పతకాలు అందుకున్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధత కలిగిన అధికారిగా మంచి గుర్తింపు పొందారు. కబడ్డీ, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచిన ఆయన జాతీయ, ఆల్ ఇండియా స్థాయిలో పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఐపీఎస్ ఆయనకు అభినందనలు తెలిపారు.



## ఇంద్రకీలాద్రి ఈఓ వీ.కే. సీనా నాయక్‌కు ఘన సత్కారం



**ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ ) మే 11:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానం ఈఓగా వి.కే. సీనా నాయక్ ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బోర్రా రాధాకృష్ణ (గాంధీ), పాలకమండలి సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయాభివృద్ధిలో ఈఓ తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, భవాని దీక్షల విరమణ, కృష్ణా పుష్కరాలను వైభవంగా నిర్వహించే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. భక్తులకు దర్శనం సులభతరం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తరించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాలకమండలి పూర్తి సహకారం అందిస్తుందని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!

- అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ హాఫ్ సెంచరీలు
- 211 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 19 ఓవర్లలో ఛేజ్
- వరుసగా నాలుగో ఓటమితో పంజాబ్ కింగ్స్ షాక్
- ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. సోమవారం ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ మరో ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించింది. కెప్టెన్ అక్షర్ పటేల్ (56), డేవిడ్ మిల్లర్ (51) సమయోచిత హాఫ్ సెంచరీలతో జట్టును ఆదుకోగా, చివర్లో అశుతోష్ శర్మ, మాధవ్ తివారీ మెరుపులు మెరిపించారు. పంజాబ్ జట్టులో శ్రేయస్ అయ్యర్, ప్రియాన్ష్ ఆర్యా రాణించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ దిశగా అడుగులు వేసిన పంజాబ్ కింగ్స్.. వరుసగా నాలుగో మ్యాచులో పరాజయం పాలైంది. సోమవారం ధర్మశాల వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో 3 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఓడినా పాయింట్స్ టేబుల్‌లో మాత్రం టాప్-4లోనే కొనసాగుతోంది. మరోవైపు టోర్నీలో ఐదో విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసుకు చేరుకుంది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 210/5 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59), ప్రియాన్ష్ ఆర్యా (56) హాఫ్ సెంచరీలు సాధించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం అందుకుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమైనా.. మిగతా వారంతా తలా ఓ చేయి వేయడంతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని కెప్టెన్ అక్షర్ పటేల్.. ఈ మ్యాచులో రాణించాడు. 30 బంతుల్లో 56 పరుగులు స్కోరు చేశాడు. డేవిడ్ మిల్లర్ సైతం 28 బంతుల్లో 51 రన్స్ చేసి.. డీసీని విజయం దిశగా తీసుకెళ్లాడు. అశుతోష్ శర్మ (10 బంతుల్లో 24 రన్స్), మాధవ్ తివారీ (8 బంతుల్లో 18 రన్స్ నాటౌట్), అకబ్ నబీ (2 బంతుల్లో 10 రన్స్) బ్యాట్ ఝుళిపించడంతో డీసీ సరిగ్గా 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. ఈ విజయంతో మిణుకుమిణుకు మంటున్న ప్లే ఆఫ్స్ ఆశలను డీసీ సజీవంగా ఉంచుకుంది. డీసీ మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు చేరనున్నాయి. అప్పుడు నెట్ రన్ రేట్



ఆధారంగా డీసీ ముందంజ వేసే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్ కింగ్స్.. ప్లే ఆఫ్స్‌కు ముందు అనూహ్యంగా తడబడుతోంది. తొలి ఏడు మ్యాచులలో పరాజయం ఎరుగని ఆ జట్టు.. ఆ తర్వాత వరుసగా నాలుగింట్లో ఓడిపోయింది. అయినా 13 పాయింట్లతో టేబుల్‌లో నాలుగో ప్లేసులో ఉంది.

## డిఫెన్స్ ఆడినా సిక్సర్ వెళ్లింది.



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. పంజాబ్ ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో లుంగీ ఎంగిడీ వేసిన స్లో బంతిని శ్రేయస్ అయ్యర్ జడ్జ్ చేయలేక, కేవలం సింగిల్ కోసం బ్యాట్‌ను అడ్డుపెట్టాడు. అయితే ఆశ్చర్యకరంగా ఆ బంతి నేరుగా స్టాండ్స్‌లో పడి సిక్సర్‌గా మారింది. ఇది చూసి బౌలర్ ఎంగిడీతో పాటు అయ్యర్ కూడా షాక్ అయ్యాడు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో ఆశ్చర్యకర ఘటన జరిగింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో పంజాబ్.. ఫస్ట్ బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. అయితే ఈ ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ కొట్టిన ఓ షాట్.. చర్చనీయాంశంగా మారింది. ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో అతడు ఒంటిచేత్తో సిక్స్ కొట్టి.. అందర్నీ ఆశ్చర్యపరిచాడు. పంజాబ్ ఇన్నింగ్స్ 12వ ఓవర్ వేసేందుకు లుంగీ ఎంగిడి బంతి అందుకున్నాడు. తొలి మూడు బంతుల్లో కేవలం రెండు రన్స్ మాత్రమే ఇచ్చాడు. ఈ ఓవర్‌లో నాలుగో బంతిని స్లో డెలివరీగా సంధించగా.. స్ట్రైకింగ్‌లో ఉన్న శ్రేయస్ అయ్యర్.. బంతిని సరిగ్గా జడ్జ్ చేయలేకపోయాడు. దీంతో కంట్రోల్ తప్పి సింగిల్ తీసేందుకు బ్యాట్‌ను బంతికి మెల్లిగా తగిలించాడు. అయితే ఇక్కడే ఆశ్చర్యం జరిగింది. శ్రేయస్ అయ్యర్ మెల్లిగా బ్యాట్ తగిలించినా.. బంతి మాత్రం స్ట్రైట్‌లో స్టాండ్స్‌లోకి వెళ్లింది. ఇది చూసిన లుంగీ ఎంగిడీ ఒక్కసారిగా షాక్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్ సైతం ఇలాంటి హావభావాలే పలికించాడు. ఈ ఇద్దరితో పాటు స్టేడియంలోని ఆటగాళ్లు, ఫ్యాన్స్.. టీవీల్లో మ్యాచ్ చూస్తున్న ప్రేక్షకులు ఇదెక్కడి షాట్ అన్నట్లు షాక్ అయ్యారు. ఈ షాట్‌కు సంబంధించిన వీడియోను ఐపీఎల్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది.

## 'మిడిల్ ఫింగర్' వివాదం

**'మిడిల్ ఫింగర్' వివాదంపై బీసీసీఐ చర్యలు**
**టిమ్ డేవిడ్‌కు భారీ జరిమానా విధింపు**
**డీమెరిట్ పాయింట్లు కూడా కేటాయింపు**



ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆర్సీబీ బెంగళూరు ప్లేయర్ టిమ్ డేవిడ్ పై బీసీసీఐ కొరడా ఝుళిపించింది. ముంబై ఓటమిని వెక్కిరిస్తూ మిడిల్ ఫింగర్ చూపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించింది. అలాగే అతడి ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లు చేర్చింది. ఈ మ్యాచ్‌లో గోల్డెన్ డకౌట్ అయిన డేవిడ్, మ్యాచ్ ఉత్కంఠగా సాగుతున్న సమయంలో సహనం కోల్పోయి ఇలా ప్రవర్తించాడు. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచులో అతి చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేయర్ టిమ్ డేవిడ్‌కు షాక్ తగిలింది. ముంబై ఇండియన్స్ ఓటమిని వెక్కిరిస్తూ.. డేవిడ్ మిడిల్ ఫింగర్ చూపించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దీంతో అతడి చర్యలను బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు వైరల్‌గా మారిన వీడియోలను చెక్ చేసిన బీసీసీఐ.. టిమ్ డేవిడ్‌పై చర్యలు తీసుకుంది. అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించింది. అంతేకాకుండా అతడి ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లు కేటాయించింది. దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. "ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.6 ప్రకారం జట్టు లేదా వ్యక్తిని ఉద్దేశించి అసభ్యకరమైన సంజ్ఞ చేయడం నిబంధనలకు విరుద్ధం. ఉల్లంఘన చర్య కింద అతడిపై చర్యలు తీసుకుంటున్నాం. అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించడంతో పాటు.. 2 డీమెరిట్ పాయింట్లు కూడా కేటాయించాం" అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్, ఆర్సీబీ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై.. 166/7 పరుగులు చేసింది. అనంతరం ఆర్సీబీ చివరి బంతికి రెండు పరుగులు చేసి విజయం సాధించింది. రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో గోల్డెన్ డకౌట్ అయినటిమ్ డేవిడ్.. మ్యాచ్ చూస్తూ టెంపర్ కోల్పోయాడు. దీంతో తన చేష్టలతో వైరల్‌గా మారాడు.

### గంభీర్ వెళ్లిన తర్వాత గాడి తప్పిన లక్నో

## వరుసగా మూడో ఏడాది నిరాశే



- గంభీర్ వెళ్లాక లక్నో వరుసగా విఫలం
- ఐపీఎల్ 2026 నుంచి తొలి నిష్క్రమణ లక్నోదే
- రిషభ్ పంత్ కెప్టెన్సీతోనూ మారని ఫలితం
- ఐదు సీజన్లలోనూ ఫైనల్ చేరని లక్నో

ఐపీఎల్ 2026 సీజన్ నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా లక్నో సూపర్ జెయింట్స్ నిలిచిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో వరుస ఓటములతో కుంగిపోయిన లక్నో, పాయింట్ల పట్టికలో పదో స్థానానికి పడిపోయింది. 2022లో ఐపీఎ? అరంగేట్రం చేసిన ఈ జట్టు, గౌతమ్ గంభీర్ మెంటార్‌గా ఉన్న తొలి రెండు సీజన్లలో ప్లే ఆఫ్స్ చేరింది. అతడు వెళ్లిపోయాక వరుసగా మూడోసారి గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. కేఎల్ రాహుల్ స్థానంలో రిషభ్ పంత్ పగ్గాలు చేపట్టినా జట్టు ప్రదర్శనలో మార్పు రాలేదు. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ చెత్త రికార్డు నమోదు చేసింది. ఈ టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా ఆ టీమ్ నిలిచింది. 2022లో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన లక్నో సూపర్ జెయింట్స్.. తమ ఐదో సీజన్‌లోనూ టైటిల్ గెలవలేకపోయింది. ఇందులోనూ చివరి మూడు ఎడిషన్లలో కనీసం గ్రూప్ స్టేజ్ కూడా దాటలేకపోయింది. కేఎల్ రాహుల్ ప్లేసులో.. రిషభ్ పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించినా.. ఫలితంలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఐపీఎల్ 2021 వరకు ఈ లీగ్‌లో 8 టీమ్స్ మాత్రమే ఉండాయి. కానీ ఐపీఎల్ 2022 నుంచి మరో రెండు జట్లను జోడించారు. ఇందులో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్.. ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చాయి. గుజరాత్ టైటాన్స్ తమ తొలి సీజన్‌లోనే విజేతగా నిలిచింది. రెండో సీజన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మరోవైపు లక్నో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఐదు సీజన్లలో ఆ జట్టు ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయింది. మూడు సార్లు కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరుకోలేదు. ఐపీఎల్ 2022, 2023 సీజన్‌లలో లక్నో జట్టు కోచింగ్ స్టాఫ్‌లో గౌతమ్ గంభీర్ ఉన్నాడు. ఆ రెండు సీజన్లలో లక్నో ప్లే ఆఫ్స్ చేరింది. ఎలిమినేటర్‌లో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2024 సీజన్‌కు ముందు గంభీర్.. లక్నోను వీడి.. కేకేఆర్ మెంటార్‌గా మారిపోయాడు. ఆ తర్వాత లక్నో ప్రదర్శన గాడితప్పింది. వరుసగా మూడు పర్యాయాలు ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరలేదు. తొలుత కేఎల్ రాహుల్, ఆపై రిషభ్ పంత్ జట్టు పగ్గాలు చేపట్టిన టైటిల్ కోరిక మాత్రం నెరవేరలేదు.

## హార్దిక్ పాండ్యాకు ఏమైంది? ఈ సీజన్‌లో మళ్లీ ఆడడా..!



ఐపీఎల్ 2026 నుంచి ముంబై ఇండియన్స్ నిష్క్రమించడం, కెప్టెన్ హార్దిక్ పాండ్యా గాయంపై ఆ జట్టుహెడ్ కోచ్ మహేల జయవర్ధనే స్పందించాడు. హార్దిక్ గత కొన్ని మ్యాచ్‌లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, అందుకే అతడిని పక్కన పెట్టాల్సి వచ్చిందని వెల్లడించాడు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్న హార్దిక్ విషయంలో తాము ఎటువంటి రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదని కోచ్ స్పష్టం చేశాడు. ఈ సీజన్‌లో ముంబై ప్రదర్శన నిరాశపరిచిందని, బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడ లేకపోవడమే కొంపముంచిందన్నాడు. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ కథ ముగిసింది. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచులో ఆ జట్టు 2 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. అయితే ఈ మ్యాచుకు రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచులోనూ అతడు ఆడలేదు. దీంతో అతడికి ఏమైంది.. ఏమైనా గాయమా.. లేదా కావాలనే పక్కన పెట్టారా అనే ప్రచారం జరిగింది. అయితే ఇదే ప్రశ్నలపై ముంబై హెడ్ కోచ్ మహేల జయవర్ధనే స్పందించాడు. హార్దిక్ పాండ్యా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని జయవర్ధనే వెల్లడించాడు. "అవును.. హార్దిక్ పాండ్యాకు వెన్ను సమస్య ఉంది. అతడు ప్రస్తుతం కోలుకుంటున్నాడు. అయితే ఇప్పటివరకూ అతడు పూర్తిగా కోలుకోలేదు. వైద్యుల పర్యవేక్షణలో హార్దిక్ ఉన్నాడు. అందుకే కొన్ని రోజులుగా ప్రాక్టీస్ కూడా చేయట్లేదు. కాబట్టి అతడి విషయంలో మేం రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు. కోలుకునే ప్రక్రియ అనేది.. రోజూవారీ ప్రాతిపదికన ఉంటుంది. దాన్ని బట్టే మేం అతడి విషయంలో నిర్ణయం తీసుకుంటాం" అని జయవర్ధనే చెప్పుకొచ్చాడు. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శనపై కూడా జయవర్ధనే స్పందించాడు. "ఈ సీజన్ నిరాశపరిచింది. మాకు మంచి అవకాశాలు వచ్చాయి. కానీ మేం సద్వినియోగం చేసుకోలేకపోయాం. బ్యాట్, బంతితో స్థిరంగా రాణించలేకపోయాం. ప్లే ఆఫ్స్‌కు మేం 2, 3 మ్యాచ్‌ల దూరంలో నిలిచిపోయాం" అని అన్నాడు. కాగా ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ దారుణ ప్రదర్శన చేసింది. 11 మ్యాచులలో కేవలం మూడింట్లో మాత్రమే గెలిచింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ ప్లేసులో ఉంది. ఈ సీజన్‌లో తమ తొలి మ్యాచులో ముంబై గెలిచింది. కానీ ఆ తర్వాత వరుసగా ఓటములు నమోదు చేసింది. తాజాగా ఆర్సీబీ చేతిలో ఓటమితో ప్లే ఆఫ్స్ చేరిపోయింది. ముంబై తన మిగిలిన మూడు మ్యాచులలో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. ఈ మూడింట్లో గెలిచి.. గౌరవ ప్రదంగా సీజన్‌ను ముగించాలని ముంబై భావిస్తోంది.



# త్రిష చేతిలో బంపర్ ఆఫర్?



మొత్తం ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో 40 ప్లస్ వయసులోనూ ఏమాత్రం క్రేజ్ తగ్గకుండా, పెద్ద పెద్ద సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్న కథానాయిక అంటే త్రిషనే. గత కొన్నేళ్లలో ఆమె తమిళంలో విజయ్, అజిత్, రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి టాప్ హీరోలతో సినిమాలు చేసింది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర' చిత్రంలోనూ నటించింది. ఐతే ఈ మధ్య ఆమె సినిమాల నుంచి కొంచెం విరామం తీసుకున్నట్లుగా కనిపించింది. త్రిషకు రాజకీయాల్లోకి వెళ్లే ఉద్దేశం ఉన్నట్లుగా వార్తలు రావడంతో ఆమె మొత్తంగా సినిమాలకు టాటా చెప్పేస్తుందా అన్న చర్చ నడిచింది. ఐతే ఇప్పటికప్పుడు ఆమె రిటైరయ్యేలా కనిపించడం లేదు. తాజాగా త్రిష ఒక మెగా మూవీకి ఓకే చెప్పినట్లు సమాచారం. సూపర్ స్టార్ రజినీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో రాబోతున్న మెగా మల్టీస్టారర్‌లో త్రిష కథానాయికగా నటించనుందట. మరి ఈ ఇద్దరు లెజెండరీ హీరోల్లో ఎవరికి త్రిష జోడీగా నటిస్తుందో తెలియదు. గతంలో సూపర్ స్టార్‌తో 'పేట' చిత్రంలో జంటగా నటించింది త్రిష. కమల్‌తో మన్మథబాణం, చీకటి రాజ్యం, థగ్ లైఫ్ చిత్రాలు చేసింది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం.. వచ్చే ఏడాది ఆరంభంలో సెట్స్ మీదికి వెళ్తుందని భావిస్తున్నారు. ఈ క్రేజీ మూవీలో నటించేందుకు త్రిష ఏకంగా రూ.12 కోట్ల పారితోషకం తీసుకోనుందట. ఇదే నిజమైతే ఆమెకు కెరీర్లో ఇదే హైయెస్ట్ రెమ్యూనరేషన్ అవుతుంది. ఈ వయసులోనూ బడా బడా సినిమాలు చేజిక్కించుకుంటూ, ఈ స్థాయిలో పారితోషకం అందుకోవడం అంటే చిన్న విషయం కాదు. కెరీర్లో లేటు వయసులో ఇలాంటి డిమాండ్ ఉన్న అరుదైన కథానాయికల్లో త్రిష ఒకరు.

# అందరి దృష్టిని ఆకర్షించింది



యువ నటి మానసా చౌదరి మరోసారి తన స్టైలిష్ ఫొటోషూట్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. అందం, అమాయకత్వం, ఆధునికత కలగలిపిన ఈ ఫొటోషూట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలతో పాటు కేవలం ఒక మెరుపు గుర్తును మాత్రమే జత చేసింది. అయితే ఆ ఫొటోలు మాత్రం మాటలకు అందని అందంతో అభిమానులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రముఖ డిజైనర్ దీప్తీ రూపొందించిన అద్భుతమైన దుస్తుల్లో మానసా ఎంతో హుందాగా కనిపించింది. సంప్రదాయ శైలికి ఆధునిక హంగులు జోడించిన ఈ వేషధారణ ఆమె అందాన్ని మరింత పెంచింది. స్టైలిస్ట్ మనోగ్న అవునూరి ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. సహాయ స్టైలిస్ట్ శ్రీవేద భగవతుల ప్రతి చిన్న అంశాన్ని జాగ్రత్తగా తీర్చిదిద్దడంతో మొత్తం లుక్ మరింత ఆకట్టుకునేలా మారింది. అమ్రపాలి సంస్థకు చెందిన ఆభరణాలు ఆమె రూపానికి రాజసమైన మెరుపును తీసుకొచ్చాయి. ఫొటోగ్రాఫర్ ఆరిఫ్ మిన్హాజ్ కెమెరాలో బంధించిన ప్రతి చిత్రం కలల ప్రపంచాన్ని తలపించేలా కనిపించింది. మానసా హావభావాలు, సహజమైన అందం ప్రతి ఫ్రేమ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇటీవలి కాలంలో మానసా చౌదరి తన గ్లామర్‌తో పాటు సహజమైన నటనతో కూడా యువతలో మంచి గుర్తింపు సంపాదిస్తోంది. ఆమె ఫ్యాషన్ ఎంపికలు, తెరపై కనిపించే ఆత్మవిశ్వాసం, ప్రత్యేకమైన వ్యక్తిత్వం కారణంగా వినోద రంగంలో ఎదుగుతున్న ప్రముఖ యువ నటీమణుల్లో ఒకరిగా నిలుస్తోంది. ప్రతి కొత్త ఫొటోషూట్‌తో మానసా చౌదరి ఒక విషయం మాత్రం స్పష్టంగా చెబుతోంది

# అద్భుతమైన జోష్‌లో మీనాక్షి చౌదరి



మీనాక్షి చౌదరి ఈ ఏడాది అద్భుతమైన జోష్‌లో దూసుకుపోతున్నారు. ఇప్పటికే "అనగనగా ఒక రాజు" చిత్రంలో చారు లత పాత్రతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆమె, ఇప్పుడు వరుస ఆసక్తికరమైన చిత్రాలతో అభిమానులను మరింత అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఆమె అందాల విషయానికి వస్తే, ఈ ఫొటోలలో మీనాక్షి నిజంగానే మెరిసిపోతున్నారు. ప్రకాశవంతమైన ఆవాల పసుపు రంగు కార్సెట్ శైలిలో రూపొందిన చిన్న పైదుస్తిని ధరించి, భుజాల వద్ద ఉన్న ముద్దైన కట్టులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దానికి లేత నీలం రంగు డెనిమ్ జీన్స్‌ను జత చేసి, సాధారణమైన బంగారు కడియంతో తన శైలిని మరింత అందంగా తీర్చిదిద్దారు. ఆమె చిన్న చిన్న ఉంగరాల్లా తిరిగిన జుట్టు ముఖాన్ని ఎంతో అందంగా అలంకరిస్తుండగా, సహజ కాంతిని మెరిపించే తేలికపాటి అలంకరణ ఆమె అందాన్ని మరింత పెంచింది. సరళతతో కూడిన ఆకర్షణ, గ్లామర్‌తో కలిసిన ఆమె రూపం ప్రస్తుతం ఎదుగుతున్న తారగా ఆమె స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది.

# ఏజ్‌లెస్ క్వీన్: 'బజార్'
## కవర్‌పేజీపై మైండ్ బ్లాక్



భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న సీనియర్ నటి టబు తాజాగా ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ –హార్పర్స్ బజార్– కవర్‌పేజీపై మెరిసి అభిమానుల మైండ్ బ్లాక్ చేశారు. జాతీయ ఉత్తమ నటిగా తన నటనతో ఎందరినో మంత్రముగ్ధులను చేసిన ఈ సీనియర్ బ్యూటీ.. ఈ ఫొటోషూట్‌లో సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. డార్క్ పింక్ గౌనులో టబు అందచందాలు మరో స్థాయిలో ఎలివేట్ అవ్వడమే కాకుండా.. తన హెయిర్ స్టైల్ ప్రయోగం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఆమె కళ్ళల్లో ఉన్న ఆ షార్ప్‌నెస్, కెమెరాకు ఇచ్చిన ఆ కాన్ఫిడెంట్ పోజ్ తనలోని అసలైన ప్రతిభావనిని బయటకు తీశాయి. ఈ కవర్ స్టోరీలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో టబు తన వ్యక్తిత్వం గురించి ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. నేటి కాలంలో మీరు ఎలా ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఉండగలుగుతున్నారు? అని ప్రశ్నించగా.. టబు తనదైన శైలిలో స్పందించారు. --నేను రెలవెంట్‌గా ఉండాలని ఏనాడూ అనుకోలేదు... అసలు నాకు ఆ ఆసక్తి కూడా లేదు. మనమే ఈ పదజాలాన్ని సృష్టించుకుని.. దాని గురించి ఆలోచిస్తూ ఆందోళన చెందుతున్నాం. రెలవెంట్‌గా ఉండాల్సిన అవసరం ఎవరికి ఉంది?-- అంటూ ఇచ్చిన సమాధానం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంది. ప్లానింగ్‌తో కాకుండా కేవలం తన పని మీద ఉన్న ఇష్టంతోనే ఇంతకాలం ఇండస్ట్రీలో కొనసాగుతున్నారని ఈ మాటలు స్పష్టం చేస్తున్నాయి.ముఖ్యంగా పింక్ – ఎల్లో కలర్ వైల్డ్ ఫ్లవర్ పెండెంట్స్ జుట్టుకు యాక్సెసరీగా వాడిన పింక్ ఇయర్ రింగ్స్ తన స్టైలింగ్‌లో కొత్తదనాన్ని చూపించాయి. ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక క్లాసిక్ ఇమేజ్ ఉన్న టబు ఈ ఆధునిక దుస్తుల్లోనూ అత్యంత హుందాతనంతో కనిపిస్తూ యువ నటీమణులకు గట్టి పోటీనిచ్చారు. టబు అందం.. ఆహార్యంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. తను ఎప్పుడూ కష్టపడి ట్రెండ్‌లో ఉండాలని ప్రయత్నించలేదని, కేవలం సత్తా ఉన్న పాత్రలను ఎంచుకోవడం వల్లే టబు పేరు నేటికీ మారుమోగుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. టబు ఏది చేసినా అది ఎఫర్ట్‌లెస్ (శ్రమ లేకుండా) గా ఉంటుంది.. ఆమె ఒక క్లాస్ అపార్ట్! అంటూ ఒక నెటిజన్ చేసిన కామెంట్ తన వ్యక్తిత్వాన్ని అద్దం పడుతోంది. నటనలో ఎంతటి గంభీరమైన పాత్రలు పోషిస్తారో... గ్లామర్ పరంగా కూడా అంతే పర్ఫెక్ట్‌గా ఉండటం టబుకు మాత్రమే సాధ్యమైంది.హిందీతో పాటు సౌత్‌లో కూడా అడపా దడపా మెరుస్తున్న ఈ నటి మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను అప్‌డేట్ చేసుకుంటూనే తనకంటూ ఉన్న –ఒరిజినాలిటీ–ని కోల్పోకుండా ఉండటమే టబు సక్సెస్ సీక్రెట్. హార్పర్స్ బజార్ కవర్ పేజీపై ఈ సీనియర్ నటి క్రియేట్ చేసిన ఈ సెన్సేషన్, వయసు అనేది కేవలం ఒక అంకె మాత్రమేనని మరోసారి నిరూపించింది. టబు లాంటి నటీమణులు ఉన్నంత కాలం భారతీయ సినిమా గ్లామర్ .. టాలెంట్ విషయంలో ఎప్పటికీ వెనుకబడదు అనడానికి ఈ ఫొటోషూట్ ఒక నిదర్శనం. టబు ప్రస్తుతం కింగ్ నాగార్జున నటిస్తున్న భారీ చిత్రంలో కలిసి నటిస్తున్న సంగతి తెలిసిందే.

# పవన్ వర్సెస్ విజయ్



దక్షిణ భారతదేశంలో అపరిమితమైన సినీ గ్లామర్ కలిగిన ఇద్దరు టాప్ హీరోలు ఇప్పుడు రెండు భిన్న రాజకీయ వేదికల మీద ఎదురు బొదురు కానున్నారు. వీరిద్దరి రాజకీయ సమరానికి 2029 లోక్ సభ ఎన్నికలు వేదికగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. విషయానికి వస్తే కాంగ్రెస్ కి సినిమా గ్లామర్ గతంలో ఇబ్బడి ముబ్బడిగా ఉండేది. ఎంతోమంది దక్షిణాది నటులు కాంగ్రెస్ వైపు ఉండేవారు. అయితే గడిచిన దశాబ్దన్నర కాలంగా కాంగ్రెస్ వైపు వెళ్ళే వారు అయితే ఎవరూ పెద్దగా కనిపించడం లేదు. కానీ ఆయాచిత వరంగా తమిళనాడు దళపతి సూపర్ స్టార్ విజయ్ కాంగ్రెస్ మొగ్గు చూపారు. దాంతో కాంగ్రెస్ కి సినీ గ్లామర్ పుష్కలంగా దక్కుతోంది. అలా హస్తం పార్టీ కి మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. సినీ గ్లామర్ నిండుగా మెండుగా ఉన్న విజయ్ తో కేవలం తమిళనాడు అవసరాలే కాదు దక్షిణ భారతంలో రాజకీయ పరిస్థితులను పూర్తిస్థాయిలో అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ భారీ స్కెచ్ నే గీస్తోంది.

**రాహుల్ విత్ విజయ్ :** ఇక తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారానికి స్వయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరలి రావడం భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు పదును పెట్టడమే అని అంటున్నారు. టీవీకే అధినేత కొత్త సీఎం విజయ్ కూడా రాహుల్ ని తన అన్నగా సంబోధిస్తూ ఆయన పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. దాంతో విజయ్ రాహుల్ సూపర్ కాంబోతో దక్షిణాదిన కాంగ్రెస్ కి మరిన్ని మంచి రోజులను తెస్తుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. దక్షిణాదిన కాంగ్రెస్ కు ఇప్పటికే మంచి పట్టు ఉంది. ఉత్తరాదిన బిజెపి ఎంత ప్రభంజనం సృష్టించినా దక్షిణాదిలో మాత్రం ఆ పార్టీకి ఆశించిన స్పందన లభించడం లేదు. ఇప్పుడు చూస్తే దక్షిణ భారతం రాజకీయ మ్యాపులో అంత కాంగ్రెస్ మయమే అయినట్లుగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక తెలంగాణ కేరళలో ఉంది. తమిళనాడులో కూడా ఇప్పుడు విజయ్ పార్టీలో చేరి ప్రభుత్వంలో భాగం అవుతోంది ఇక ఏపీ ఒక్కటే ఎన్డీఏ కి ఆశాకిరణంగా ఉంది. దాంతో నరేంద్ర మోడీ సినీ గ్లామర్ ని సినీ గ్లామర్ తోనే దక్షిణాదిన ఢీ కొట్టాలని భావిస్తున్నారు అని అంటున్నారు. అందుకే ఎన్నడూ లేని విధంగా దక్షిణాది రాష్ట్రాలలో పవర్ స్టార్ గా పవర్ ఫుల్ ఇమేజ్ తో ఉన్న పవన్ కళ్యాణ్ ఇంటికి మోడీ వెళ్లి భేటీ కావడం సరికొత్త రాజకీయ విశ్లేషణలకు తావిస్తోంది. ఒకవైపు విజయ్ తన సినీ గ్లామర్ కు రాజకీయ గ్రామర్ ని జోడించి తమిళనాడులో సూపర్ హిట్ కొట్టారు. ఏకంగా ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి అయిపోయారు. ఆయన అండతో తెలుగు రాష్ట్రాల్లో కూడా తన రాజకీయ జాతకాన్ని మార్చుకోవాలని కాంగ్రెస్ కోటి ఆశలు పెట్టుకుంది. ఇక పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వెండి తెర మీద సూపర్ స్టార్ అనడంలో సందేహం లేదు. ఆయనను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా దక్షిణ భారతదేశంలో కాషాయం రెపరెపలను చూడాలని బిజెపి పెద్దలు ఆశపడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బిజెపి సహిత ఎన్డీఏ ప్రభుత్వాలను రానున్న రోజుల్లో ఏర్పాటు చేయాలని, అలాగే కర్ణాటకలో విజయం సాధించడంతోపాటు తమిళనాడులో విజయ్ సినీ గ్లామర్ అడ్డుకొని పవన్ ద్వారా బీజేపీ కొత్త రాజకీయానికి తెర తీయాలని చూస్తోంది. వీలైతే కేరళలో కూడా పవన్ ఇమేజ్ ని వాడుకోవాలని భావిస్తోంది. చాశ్రీంశీ =ఖుఃు – మోడీతో భేటీ....సోనియాతో లంచ్ సౌత్ లో స్టార్ వార్ : దాంతో అటు విజయ్ ఇటు పవన్ ఈ ఇద్దరి మధ్యనే 2029 లో రాజకీయం ఢీ అంటే ఢీ కొట్టిన ఉండే పరిస్థితి కనిపిస్తోంది. విజయ్ తనదైన సరికొత్త భావజాలాన్ని దక్షిణాదిన పెద్ద ఎత్తున విస్తరించాలని చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ బిజెపి హిందుత్వ సనాతన వాదాన్ని ఇప్పటికే బలంగా నమ్ముతూ జనంలోకి తీసుకెళ్తున్నారు. దాంతో విజయ్ సిద్ధాంతం నెగ్గుతుందా పవన్ సనాతనం జనాల్ని ఆకట్టుకుంటుందా అన్నది కూడా ఒక చర్చగా ఉంది. ఏది ఏమైనా పవన్ విజయ్ ఇద్దరూ వెండి తెర మీద తిరుగులేని సూపర్ స్టార్లు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి అయితే విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి. ఈ ఇద్దరి మధ్య సినీ రాజకీయ ఇమేజ్ ఏ స్థాయిలో ఢీ కొడుతుందో రానున్న లోక్ సభ ఎన్నికలే రుజువు చేయనున్నాయి ఈ ఇద్దరి వెనక మోడీ వర్సెస్ రాహుల్ రాజకీయ చాణక్యం కూడా మిక్స్ అయితే పవర్ ఫుల్ పొలిటికల్ మూవీనే వచ్చే ఎన్నికల్లో అంతా చూడొచ్చు అన్న మాట.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN